ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27.07.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలులో జరిగిన అవకతవకలపై విచారణకు అంగీకరించాలని BRS పార్టీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. 2024-25 వార్షిక బడ్జెట్‌పై రాష్ట్ర శాసనసభ, శాసన మండలిలలో చర్చ జరుగుతోంది.
2. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో నీతి అయోగ్ 9వ పాలక మండలి సమావేశం ప్రారంభమైంది. ఈ సంవత్సరం సమావేశం ఇతివృత్తం "వికసిత్ భారత్@2047"గా ఉంది.
3. తెలంగాణాకు కేంద్ర ప్రభు త్వం అందించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు గణనీయంగా పెంచినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రల్హాద్ జోషీ అన్నారు.
4. నీతి అయోగ్ సమావేశానికి రాకుండా, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు.

**ASSEMBLY:**

వివిధ పథకాల అమలులో అవకతవకలపై విచారణకు సిద్ధంగా ఉన్నదీ లేనిదీ ప్రతిపక్ష BRS పార్టీ చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో నిజాయితీ పాలన అందించి ఉంటే , బతుకమ్మ చీరలు , KCR కిట్స్, గొర్రెల పంపిణీ పై విచారణకు సిద్ధంగా ఉండాలన్నారు. వార్షిక బడ్జెట్ 2024-25 పై శాసనసభ ఈ ఉదయం చేపట్టిన చర్చ సందర్భంగా BRS సభ్యులు హరీష్ రావు మాట్లాడుతుండగా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని , ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలు

ఈ ప్రయత్నాలను నమ్మరన్నారు. ప్రజా తీర్పు స్పష్టంగా ఉన్నా , BRS నాయకుల ధోరణి మారలేదన్నారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును 7వేల కోట్లకే BRS ప్రభుత్వం అమ్మేసిందని, గొర్రెల పంపిణీ పథకం పేరుతో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని, బతుకమ్మ చీరల పంపిణీ లోనూ అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వం ఎన్ని వేల కోట్ల విలువైన భూములు అమ్మిందో లెక్క తీద్దామని చెప్పారు. కాగా అంతకుముందు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని మాట్లాడుతూ , గత ప్రభుత్వ పదేళ్ళ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదనీ, ఇప్పుడిప్పుడే ప్రభుత్వం తిరిగి గాడినపడుతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు భ్రమలు కల్పించేందుకు హరీష్ రావు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**MSL**

--------------------------------------

**COUNSIL**

శాసన మండలిలో కూడా బడ్జెట్ పై ధీర్ఘాకలిక చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ... ధరణి సమస్యల్ని విన్నవించుకోవడానికి పరిష్కారానికి ప్రతి జిల్లాలో రెవిన్యూ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధరణి సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పుడున్న ధరణి సమస్యలపై ఆన్ లైన్ లో దరఖాస్తులు పెట్టుకున్నా దానికి సరైన సమాధానం రావడం లేదని మండలి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుని , రైతులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా , మిగిలి ఉన్న వీఆర్ఎలకు ఇతర శాఖల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకోవాలని, ముఖ్యంగా 55 నుంచి 61 సంవత్సరాలు పైపడిన వారికి జీవో 81 వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని జీవన్ రెడ్డి అన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసుధానాచారి చర్చను ప్రారంభించారు.

**SDP**

---------------------------

**PM - GOVERNING COUNCIL**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో నీతి అయోగ్ 9వ పాలక మండలి సమావేశం ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సంవత్సరం సమావేశం ఇతివృత్తం "వికసిత్ భారత్ @2047"గా ఉంది. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంపై కేంద్ర దృష్టి సారించింది. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు , కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు , కేంద్రమంత్రులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. వికసిత్ భారత్ -2047 లక్ష్యాలపై చర్చిస్తున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర బడ్జెట్ లో నిధుల కేటాయింపుల లో వివక్ష జరిగిందని నిరసన తెలుపుతూ ఈ సమావేశాన్ని బహిష్కరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ సమావేశాన్ని బహిష్కరించారు.

**NSD**

--------------------------------

**నిధులు: జోషి**

తెలంగాణాకు కేంద్ర ప్రభుత్వం అందించే గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు గణనీయంగా పెంచినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రల్హాద్ జోషి అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కేవలం ఏడు నుంచి 8 వందల కోట్ల రూపాయిలు ఉండేదని , ఇప్పుడు 7 వేల కోట్ల రూపాయిల వరకు వస్తున్నాయని అన్నారు. ఇంకా రహదారులు , మౌలిక సదుపాయాల కల్పనా, వంటి పలు అంశాలలో రాష్ట్రానికి నిధుల కేటాయింపులున్నాయని ఆయన వివరించారు. హైదరాబాద్ లో కొద్ది సేపటి క్రితం కేంద్ర మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెసు నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకే కేంద్రం ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల అభివృద్ధి ఆకాంక్షలను నెరవేర్చటం తమ

ప్రాధాన్యత అన్నారు. నీతీ ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించటం వల్ల రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయటమేనని అన్నారు.

**MSL**

-----------------------------

**BONALU**

హైదరాబాద్ వ్యాప్తంగా రేపు ఆషాఢ బోనాల పండుగ జరుగుతుంది. పాత బస్తీలోని లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లాల్ దర్వాజకు లక్ష మందికి పైగా భక్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపు తెల్లవారుజామున సింహవాహిని అమ్మ వారికి జల్లెకడువ , బలిహరణ నిర్వహిస్తారు. ఉదయం దేవీ మహాభిషేకం తర్వాత బోనాలతో వచ్చే భక్తులను అనుమతిస్తారు. ఎల్లుండి అంటే మధ్యాహ్నం వరకు సాంస్కృ తిక కార్య క్రమాలు, తర్వాత పోతరాజుల స్వాగతం ఉంటుంది. సాయంత్రం రంగం కార్యక్రమం తర్వాత రథయాత్ర ఉంటుంది. ఈ నేపథ్యంలో రేపు , ఎల్లుండి లాల్ దర్వాజ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ విభాగం అదనపు సీపీ అదనపు సీపీ విశ్వప్రసాద్ వెల్లడించారు. అక్కన్న మాదన్న ఆలయం నుంచి నయాపూల్ వరకు కొనసాగే భారీ ర్యాలీలో ఏనుగుపై ఉరేగింపు ఉంటుంది. కాబట్టి, ఈ ఉత్సవానికి వచ్చే భక్తులు పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను పార్కు చేయాలని ఆయన సూచించారు. మరోవైపు హైదరాబాద్ లోని ప్రముఖ ఆలయాలన్నీ బోనాల ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. నిర్వాహకులు ముందస్తుగా ఆలయాల వద్ద లైటింగ్ క్యూలైన్లు, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైరాబాద్లోని 9 ప్రధాన ఆలయాల్లోని అమ్మవార్లకు రాష్ట్ర మంత్రులు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

**DESK**

---------------------------

**BANDI SANJAY**

రెండు లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్ లో లక్ష కోట్లు కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి  బండి సంజయ్ కుమార్  పేర్కొన్నారు. కరీంనగర్ లో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై చర్చ జరుగకుండా చేయడానికే, కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయం అనుబంధ రంగాలకు   2 లక్షల కోట్లు , మహిళలు అభివృద్ధికి 3 లక్షలు కోట్లు ,  గ్రామాల అభివృద్ధికి రెండు లక్షల కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు. నీతి అయోగ్ సమావేశానికి రాకుండా     ,  మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు.

**PTC, KARIMNAGAR**

----------------------------------

**WEATHERUPDATE**

రాష్ట్రంలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నిన్న కొంచెం తెరిపిచ్చినా ఈ తెల్లవారుజాము నుంచి రాష్ట్రవ్యాప్తంగా చిరు జల్లులు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలో  వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. హైదరాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది.

**DESK**

---------------------------------

**NAGARJUNA SAGAR**

ఎగువ నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో నాగార్జున సాగర్ లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం  590 అడుగులు కాగా ప్రస్తుతం అది  507 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ కు    52 వేల  100 క్యూసెక్కుల నీరు వస్తుండగా  , సాగర్ ఎడమకాలువ ద్వారా  5 వేల  700 క్యూసెక్కులు , హైదారాబాద్ తాగు నీటి అవసరాల

కోసం మరో  400 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 864.5 అడుగులకు చేరింది.

**PTC, Nalgonda**

---------------------------

**BHADRADRI -GODAVARI**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా  ,  భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం  51.8 అడుగులకు చేరుకుంది.  53 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. ఎటపాక వాగు పొంగడంతో లోతట్టు ప్రాంతంలో ఉన్న కొత్త కాలనీలోకి వరద నీరు వచ్చింది. దీంతో సుమారు  30 కుటుంబాలను భద్రాచలంలోని ఓ పునరావాస కేంద్రానికి తరలించారు. ఎటపాక వాగు బ్యాక్ వాటర్ ను ఇరిగేషన్ అధికారులు మోటార్ పంపులతో ఎత్తిపోస్తున్నారు. కాగా, గోదావరికి వరద అధికంగా వస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

**PTC, KOTTAGUDEM**

-----------------------------------

**PEDDAPALLY**

ఇదిలా ఉండగా పెద్దపల్లిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తుంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, సుమారు 17 టీఎంసీలకు చేరింది.

**----------------------**